










దోభీఘాట్‌ల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి టౌన్ : దోభీఘాట్‌లలో విద్యుత్ సదుపాయం లేక నిరుపయోగంగా ఉన్నాయని అన్నమయ్య జిల్లా రజక సంఘం సభ్యులు బీసీ ఉమ్మడి కడప కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయసంహకు వినతి పత్రాన్ని సమర్పించారు. మంగళవారం కడపలోని ఆయన కార్యాలయంలో అన్నమయ్య రజక సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, ఉపాధ్యక్షులు ఎంవీ రమణ, టి.లక్ష్మినారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు దోభీఘాట్‌లలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. సౌకర్యాలు లేక కుల వృత్తులకు రజక యువత దూరంగా ఉంటోందని తెలియజేశారు. రజకులకు వడ్డీలేని రుణాలు అందజేసి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రజకులు పాల్గొన్నారు.











సరికొత్త ఆశయాలతో ముందుకు సాగాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : గడిచిన సంవత్సరపు అనుభవాలు, జ్ఞాపకాలతో నూతన ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నూతన ఏడాదిలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు తదితర అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని, అభివృద్ధిబాటలో నడవాలని ఆయన అభిలాషించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు

ఓబులవారిపల్లె : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను తిరుపతిలోని వారి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి పంచాయతీలోని రోడ్ల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు పి.సుబ్బరాయుడు, యల్లాయపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వీరబల్లి : చిలకపాటివాళ్లపల్లి వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురు జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు మండల ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపారు. వారివద్ద నుంచి రూ. 3130లు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.





